కథ

# సంతకం

జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి
99488 96984

"సంతకం అంటే మనిషి హోదాకీ విలువకీ మాత్రమే కాదు.. మానవత్వానికీ సహృదయతకీ గుర్తింపేనని నిరూపించావు. ఈరోజు నా సంతకం, నీ ఔన్నత్యానికి సాక్ష్యంగా మారుతున్నది. నేను చాలా అదృష్టవంతురాల్ని'' అంటూ.. సంతకం చేసిన అనుమతి పత్రాలని వినీత్ చేతిలో పెట్టింది స్నిగ్ధ.

ఆ పత్రాలను బల్లమీద పెట్టి..

''అదృష్టం నీది కాదు, నాది'' అంటూ ఆమెను చుట్టేశాడు వినీత్.

కానీ, అసలైన అదృష్టం వాళ్లిద్దరిది కూడా కాదు.

అనుకూల దాంపత్యానికి ఉదాత్తమైన భాష్యం చెప్పే ఈ కథ.. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా వినీత్ హైదరాబాద్ వెళ్లడంతో ఆరంభమైంది.

* * *

హైదరాబాద్‌లో ఎప్పుడూ దిగేచోటే దిగాడు వినీత్. స్నానం చేసి ఎప్పట్లాగే దగ్గరలోని శివాలయానికి బయల్దేరాడు. ఎప్పట్లాగే రణగొణ ధ్వనులతో శబ్ద కాలుష్యాన్నీ, ఇంధనం వెలువరించే పొగలతో వాయుకాలుష్యాన్నీ నగరానికి ఉచితంగా సరఫరా చేస్తూ.. అడ్డదిడ్డంగా పరుగులు తీస్తున్నాయి వాహనాలు.

వంతెనమీది నడకదారిలో ఆ చివర కూర్చుని ఉన్నాడొక యువ బిచ్చగాడు. జానెడు గడ్డం-బారెడు జుట్టు. అప్పుడే స్నానం చేసి వచ్చినట్లున్నాడు. నల్లటి గడ్డం మధ్య మరింత నల్లటి ముఖం సూర్యకాంతిలో నిగనిగలాడుతున్నది. అతణ్ని చూసి..

'బుద్ధిగా పని చేసుకోవడం మానేసి అడుక్కోవడం ఏం ఖర్మ?'' అనుకుంటూ, అతణ్నేమాత్రం పట్టించుకోకుండా గుడికి వెళ్లిపోయాడు వినీత్.

గుడిలో దర్శనం చేసుకుని బయటికి రాగానే మెట్లమీద బిచ్చగాళ్ల అరుపులు చుట్టుముట్టాయి. వాటిని వింటూంటే వంతెన చివరి బిచ్చగాడు గుర్తొచ్చాడు. దాంతో అలవాటు ప్రకారం జేబులోకి వెళ్లబోయిన చేతిని వెనక్కి తీసేసుకున్నాడు. వీళ్లంతా తమ వృత్తి నై-పుణ్యంతో భక్తులకు పుణ్యాన్ని పంచుతున్నామని డబ్బాలు కొట్టిమరీ చాటుకుంటారు. వేసినవాడికి పుణ్యం మాటెలాగున్నా వెయ్యనివాడికి శాపనార్థాలు మాత్రం తప్పవు. మరా గడ్డం బిచ్చగాడు? పాపం అతనికి అడుక్కోవడంలో ఓనమాలు కూడా తెలిసినట్లు లేవు. తెలిస్తే పాదచారులు బిచ్చం వెయ్యడానికి వీలుగా కనీసం తన ముందు తుండుగుడ్డయినా పరుచుకోకుండా ఉంటాడా? ఇచ్చేదేదో అలాంటివాడికి ఇస్తే సద్వినియోగం అవుతుందని అనిపించింది. అందుకే వృత్తి బిచ్చగాళ్ల అరుపుల్ని పట్టించుకోకుండా మెట్లు దిగిపోయాడు.

వినీత్ వెళ్లేసరికి ఇంకా అక్కడే కూర్చుని ఉన్నాడా బిచ్చగాడు. అతని కళ్లలో అపారమైన వెలితి. అంతులేని నైరాశ్యం.

అవే అతనిపట్ల తనలో జాలి కలిగించి ఉంటాయని అనుకుంటూ.. జేబులో చెయ్యిపెట్టాడు వినీత్. చేతికి ఐదు రూపాయల నాణెం తగిలింది. కానీ దాన్ని తియ్యబుద్ధి కాలేదు. అందుకే పది రూపాయల కాగితం తీసి అతని చేతికందేలా పట్టుకున్నాడు.

ఆ బిచ్చగాడు దానివైపు భావరహితంగా చూస్తున్నాడే తప్ప అందుకోవడానికి చెయ్యి ముందుకి చాచడం లేదు. దాంతో అతను గుడ్డివాడేమో అనే అనుమానం కలిగింది. అందుకే ఆ పదిరూపాయల కాగితాన్ని అతని చొక్కాజేబులోకి దూర్చాడు. తన చేతి స్పర్శ తెలిశాకైనా స్పందిస్తాడని అనుకున్నాడు వినీత్. కానీ, అతని నుంచి ఏ ప్రతిక్రియాలేదు. చూపుల్లోకి ఏ భావమూ రాలేదు. అంటే తను ఊహించింది నిజమే కావచ్చు అనుకుంటూ ముందుకు కదిలాడు.

నాలుగడుగులు వేశాడో లేదో వెనకనుంచి దుమ్ములగొండి నవ్వులాంటి వెకిలి నవ్వు వినిపించింది. వెంటనే వెనక్కి తిరిగాడు. ఆ బిచ్చగాడు తనలో తనే నవ్వుకుంటూ పదికాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపేస్తున్నాడు. అంటే అతను గుడ్డివాడు కాదు, బహుశా తనిచ్చిన పదిరూపాయలు అతనికి చాల్లేదు కాబోలు అందుకే చింపేసుంటాడు.

'అయినా అడుక్కునేవాడికి అంత అహంకారం పనికిరాదు' అనుకుంటూ తనదారిన తను వెళ్లిపోయాడు.

* * *

తన బాధ్యతల్లో భాగంగా స్థానిక కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్నాడు వినీత్. అంతలోనే తన శాఖలోనే పనిచేసే ఒక ఉన్నతోద్యోగి తనని బయటికి తీసుకెళ్లి కాఫీ ఇప్పించాడు. పనిలో పనిగా ఐదువందల కట్టనొకదాన్ని జేబులో పెట్టబోయాడు. వినీత్ దాన్ని సున్నితంగా తిరస్కరిస్తుండగా వంతెన బిచ్చగాడు గుర్తొచ్చాడు. దుమ్ములగొండి ఇకిలింపు గుర్తొచ్చింది. ఆ ఉన్నతోద్యోగి ఇచ్చిన డబ్బు తిరస్కరించడానికి తన కారణాలు తనకున్నాయి. అలాగే తన పది కాగితాన్ని చింపి పారెయ్యడానికీ అతని కారణాలు అతనికీ ఉంటాయనుకున్నాడు వినీత్. అలా అనుకోగానే ఆ కారణాలేమిటో తెలుసుకోవాలనే ఆసక్తి మొదలైంది.

మధ్యాహ్నం భోజనాల వేళ గదికొచ్చాడు. భోజనం చేస్తూ యథాలాపంగా కిటికీలోంచి బయటకి చూస్తే వంతెన కనిపించింది. వంతెన చివర బిచ్చగాడూ కనిపించాడు. భోజనం చేస్తూనే ఆ బిచ్చగాణ్ని గమనిస్తున్నాడు వినీత్. అదే సమయంలో వంతెన మీద భార్యాభర్త, వాళ్ల పిల్లాడూ వస్తూ కనిపించారు. ఆ బిచ్చగాణ్ని చూడగానే భార్య ఏదో చెప్పింది. భర్త జేబులోంచి ఓ నాణెం తీసి కళ్లకద్దుకుని భార్యచేతిలో పెట్టాడు. ఆమె కూడా నాణాన్ని కళ్లకద్దుకుని పిల్లాడి చేతికిచ్చింది. అ పిల్లాడు కూడా దాన్ని కళ్లకు అద్దుకున్నాడు. ఆవిధంగా వాళ్లు ముగ్గురూ దానం చెయ్యడానికి ముందే దాని తాలూకూ పుణ్యాన్ని సరిసమానంగా పంచుకోవడం చూసి వినీత్‌కి నవ్వొచ్చింది.

పిల్లవాడు తన చేతిలోని నాణేన్ని బిచ్చగాడి ముందు పడేసి తల్లిదండ్రుల వెంట వెళ్లిపోయాడు.

ఇప్పుడా బిచ్చగాడి స్పందనెలా ఉంటుందో చూడాలనే కుతూహలంతో అతణ్నే గమనిస్తున్నాడు వినీత్.

బిచ్చగాడు ఆ నాణేన్ని తీసుకున్నాడు. నాలుగైదుసార్లు అటూఇటూ తిప్పి చూశాడు. తరువాత దాన్ని గుప్పిట్లో బిగించి గుండెలకి అన్నుకున్నాడు. అతని చర్యని చూడగానే..

'బహుశా అతను చిల్లర నాణాలు తప్ప కాగితాలు తీసుకోడుగాబోలు!' అనే అనుమానం కలిగింది. అయినా తరవాతేం చేస్తాడో చూద్దామనే కుతూహలమైతే తగ్గలేదు.

బిచ్చగాడు నాణేన్ని గుండెలకి అన్నుకునే మనసులో ఏదో తలుచుకున్నాడు. ఆ తలుచుకున్నది జరుగుతుందో లేదో తేల్చుకోవడానికి బొమ్మా బొరుసూ వేశాడు. నాణెం గిర్రున తిరుగుతూ పైకి వెళ్లింది. కింద పడుతున్నప్పుడు రెండు చేతుల్తో పట్టుకున్నాడు. ఏం పడిందో ఆత్రంగా చూసుకున్నాడు. అనుకున్న ఫలితం వచ్చినట్టు

